సాక్షి రంగారెడ్డి

శుక్రవారం ၊ 10 ၊ నవంబర్ ၊ 2023



ప్రచార కూలీలు

ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎప్పుడూ వెంట జనం ఉండేలా చూసుకుంటున్నారు. 10లో▸



కాషాయ జెండా ఎగరేస్తాం

మహేశ్వరం గడ్డపై కాషాయ జెండా ఎగుర వేస్తామని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. 10లో▸



ఓట్లు @ ఐదు రకాలు

ఎన్నికలు అంటేనే గుర్తుకు వచ్చేది ఓటు. ఓట్ల లో ఐదు రకాలు ఉంటాయి. వివిధ హోదాల్లో వీటిని వినియోగించుకోవచ్చు. 10లో▸

నామినేషన్ల జోరు



ఇబ్రహీంపట్నంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



చేవెళ్లలో ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాలె యాదయ్య



ఇబ్రహీంపట్నంలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి

పట్నం.. రణరంగం

ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత

- నామినేషన్ ర్యాలీలో తీవ్ర ఘర్షణ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ రాళ్లవర్షం
- 50 మందికిపైగా కార్యకర్తలకు గాయాలు
- ఆందోళకారులను చెదరగొట్టేందుకు పలుమార్లు లాఠీచార్జి





దాడిలో గాయపడ్డ తుర్కయంజాల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హరిత, తదితరులు



దాడిలో గాయపడ్డ పోలీసును పరామర్శిస్తున్న రాచకొండ పోలిస్ కమిషనర్ డీఎస్ చౌహాన్

ఇబ్రహీంపట్నం రూరల్: నామినేషన్ల పర్వంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ బల నిరూపణ ర్యాలీ గొడవకు దారి తీసింది. ఒక్కసారిగా ఇరువర్గాలు రాళ్లు రువ్వుకోవడంతో ఘటనా స్థలి రణరంగాన్ని తలపించింది. ఈ దాడుల్లో ఇరు పార్టీల కార్యకర్తలతో పాటు పలువురు పోలీసులు గాయపడ్డారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి గురువారం నామినేషన్లు సమర్పించడానికి ర్యాలీగా బయలుదేరారు. ముందుగా కాంగ్రెస్ అభ్యర్థి రంగారెడ్డికి మధ్యాహ్నం 12:30 వరకు, ఆ తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డికి పోలీసులు సమయం ఇచ్చారు.

జనసంద్రాన్ని తలపించిన పట్నం..

తొర్రూర్‌లోని తన నివాసం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి వేలాది మంది కార్యకర్తలతో ఇబ్రహీంపట్నం చేరుకున్నారు. అంబేడ్కర్ చౌరస్తాలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించి.. ఆర్డీఓ కార్యాలయానికి బయలుదేరారు. మరోవైపు ఇబ్రహీంపట్నంలోని ఎల్మినేడు రోడ్డు మీదుగా, సాగర్‌రహదారి నుంచి శాస్త్రి ఫంక్షన్ హాల్ వద్ద వేలాదిమంది బీఆర్ఎస్ కార్యకర్తల ర్యాలీతో కిషన్‌రెడ్డి సైతం అంబేడ్కర్ చౌరస్తాకు బయలుదేరారు. కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ కార్యాలయాన్ని దాటి ఆర్డీఓ ఆఫీసుకు చేరుకుంటున్న సమయంలో బీఆర్ఎస్ ర్యాలీ ఇక్కడికి చేరుకుంది. రహదారికి ఇవతలి వైపు బీఆర్ఎస్, అవతలి వైపు కాంగ్రెస్ కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు ప్రారంభించారు. డివైడర్‌కు ఇరువైపులా నిలబడి ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. చెప్పులు, జెండా కర్రలు విసురుకున్నారు. వేల సంఖ్యలో చేరుకున్న ఇరు పార్టీల శ్రేణులను అదుపుచేయడం పోలీసులతో కాలేదు. సుమారు అరగంట పాటు రాళ్ల వర్షం కురవడంతో ఎవరికి వారు ప్రాణాలు దక్కించుకునేందుకు పరుగులు పెట్టారు.

తీవ్ర గాయాలు

ఈ ఘటనలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన సుమారు 50 మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. మహిళలతో పాటు పోలీసులు సైతం గాయపడ్డారు. వీరందరినీ స్థానిక ప్రైవేటు ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స చేయించారు. ఎల్బీనగర్ డీసీపీ సాయికల్పన, మరో నలుగురు పోలీసులు గాయపడ్డారు.

పలుమార్లు లాఠీచార్జి

ఆందోళనకారులను చెదరగొట్టేందుకు ప్రత్యేక బలగాలు ఆర్డీఓ ఆఫీసు వద్దకు చేరుకున్నాయి. నిరసనకారులను చెదరగొట్టేందుకు లాఠీలు ఝులిపించారు. ఈ క్రమంలో కొంత మంది కార్యకర్తలకు గాయాలయ్యాయి.

కమిషనర్, అభ్యర్థుల పరామర్శ

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఘర్షణలో గాయపడ్డ పోలీసులను రాచకొండ పోలిస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్, అడిషనల్ సీపీ తరుణ్‌జోషి, మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీనివాస్ పరామర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు సైతం తమ పార్టీల కార్యకర్తలను పరామర్శించి పార్టీల కార్యకర్తలను అభ్యర్థులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి పరామర్శించారు.

దాడులను ఖండించిన ఇరుపార్టీల నేతలు

ఓటమి భయంతోనే కాంగ్రెస్‌పార్టీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. నామినేషన్ల అనంతరం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జి తీగల కృష్ణారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్‌రెడ్డి రంగారెడ్డి అరచకాలకు కేరాఫ్ అడ్రస్ అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకే దాడులకు పాల్పడినట్లు చెప్పారు. ఖబడ్దార్ మల్‌రెడ్డి రంగారెడ్డి నీ ఆటలు సాగవని హెచ్చరించారు. బీఆర్ఎస్ గుండాలు చేసిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. నామినేషన్ అనంతరం జరిగిన ఘటనపై మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి, రాంరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నరన్నారు. అధికార పార్టీ ఆగడాలకు రోజులు దగ్గరపడ్డాయని, ప్రజలు ఓటు ద్వారా గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

పోటాపోటీ

- ప్రధానపార్టీల బలప్రదర్శన
- నామినేషన్లు వేసిన అభ్యర్థులు
- మద్దతుదారులు, కార్యకర్తలతో భారీ ర్యాలీలు
- పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం
- నామినేషన్ల దాఖలుకు నేడు చివరిరోజు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నామినేషన్ల గడువు శుక్రవారంతో ముగియనుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసేందుకు గురువారం ఆయా రిటర్నింగ్ ఆఫీసులకు క్యూ కట్టారు. కొంతమంది ఆయా నియోజకవర్గాల్లోని ప్రముఖ దేవాలయాల్లో నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, భారీ ర్యాలీగా బయలు దేరారు. మరికొంత మంది తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని, నేరుగా ర్యాలీగా వెళ్లి నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం ఏకాదశి మంచి ముహూరం ఉండటంతో చాలావరకు ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఈ సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు బల ప్రదర్శనకు దిగారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రోడ్లపై ట్రాఫిక్ రద్దీ నెలకొంది. నామినేషన్లకు శుక్రవారం చివరి రోజు కావడంతో అభ్యర్థులంతా నామినేషన్లు వేసే అవకాశం ఉండటంతో పోలీసులు ఆయా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

'పట్నం'లో ఉద్రిక్తం

నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ ఉద్రిక్తతకు దారితీసింది. ర్యాలీలో ఒకరిపై మరొకరు చెప్పులు, రాళ్లు విసురుకున్నారు. ఈ ఘటనలో ఇరు పార్టీలకు చెందిన సుమారు యాభై మంది కార్యకర్తలు గాయపడ్డారు. పరిస్థితి అదుపుతప్పడంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీలకు పని చెప్పారు. మొత్తం 19 నామినేషన్లు దాఖలు కాగా, వీటిలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మూడు సెట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి, సీపీఎం పార్టీ అభ్యర్థి పగడాల యాదయ్య నామినేషన్లు సమర్పించారు.

మహేశ్వరంలో..

మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ కర్మన్‌ఘట్ ఆంజనేయ స్వామి దేవయాలయంలో పూజలు నిర్వహించి, అనంతరం వేలాది మంది కార్యకర్తలతో బైక్ ర్యాలీగా బయలు దేరారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ ఈ నామినేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా బాలాపూర్ లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. అదే సమయంలో అటుగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలకు బీజేపీ నాయకులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది. బీజేపీ ర్యాలీతో ఇటు మందమల్లమ్మ చౌరస్తా నుంచి బాలాపూర్, తుక్కుగూడ, మహేశ్వరం వరకు ట్రాఫిక్ జాం ఏర్పడింది. మధ్యాహ్నం రెండు గంటలకు మహేశ్వరం రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని ఆయన తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. మొత్తం 14 మంది 18 నామినేషన్లు వేశారు. వీరిలో బీజేపీ అభ్యర్థి అందెల స్వయంగా వచ్చి రెండు సెట్లు దాఖలు చేయగా, బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి తరఫున ఆమె మద్దతు దారులు రెండో సెట్ నామినేషన్ వేశారు.

ఎల్‌బీనగర్ నుంచి..

ఎల్‌బీనగర్ నియోజకర్గంలో మొత్తం 14 నామినేషన్‌లు దాఖలయ్యాయి.వీరిలో బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్వయంగా ఒక సెట్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేశాడు. ఆయన తరుపున మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి మరో సెట్ నామినేషన్ సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కిగౌడ్ తాను ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ పార్టి నాయకుడు మరోసెట్ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓకి అందజేశారు.

ఇతర నియోజకవర్గాల్లో ..

- చేవెళ్ల నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు, 16 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య (రెండు సెట్లు), కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీం భరత్, బీజేపీ అభ్యర్థి కొరని సాయన్న రత్నం, బీఎస్పీ అభ్యర్థి తొండుపల్లి రాజు (రాజామహేంద్రవర్మ) సహా ఇతర అభ్యర్థులు ఉన్నారు.
- షాద్‌నగర్‌లో పది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి అందె బాబయ్య, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పి.విష్ణువర్ధన్ రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి పి.ప్రశాంత్‌కుమార్ సహా మరికొంత మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు.
- కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో 9 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి ఆచారి తరపున ఆయన సతీమణి గీత సహా మరికొంత మంది నేతలు కలిసి నామినేషన్ దాఖలు చేశారు. బీఎస్పీ నుంచి శ్రీనివాసులు సహా పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు.
- శేరిలింగంపల్లిలో ఏడుగురు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ ర్యాలీగా వచ్చి బీ ఫాంతో అధికారికంగా నామినేషన్ దాఖలు చేశారు. బీఎస్పీ అభ్యర్థిగా ఒంగోరు శ్రీనివాస్ యాదవ్ సహా పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు.
- రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 12 మంది నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాసరెడ్డి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ హనుమాన్ దేవాలయంలో ఉదయం నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భారీ ర్యాలీగా ఉప్పర్‌పల్లి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. రిటర్నింగ్ ఆఫీసర్‌కు తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ సహా పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు.



మహేశ్వరంలో బీజేపీ నుంచి నామినేషన్ వేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్



చేవెళ్లలో ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం



ఆమనగల్లు: కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న ఆయన సతీమణి గీత



షాద్‌నగర్: నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నంలో సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్య నామినేషన్



మహేశ్వరంలో బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి తరపున నామినేషన్ వేస్తున్న ఆమె మద్దతుదారులు



చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ తరపున నామినేషన్ వేస్తున్న ఆయన సతీమణి జ్యోతి

న్యూస్‌రీల్

నేడు సబితారెడ్డి నామినేషన్

మహేశ్వరం: బీఆర్ఎస్ అభ్యర్థి పట్లోళ్ల సబితారెడ్డి శుక్రవారం తన అనుచరులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీతో వచ్చి నామినేషన్ వేయనున్నారు. ఉదయం 9 గంటలకు కర్మాన్‌ఘట్ హనుమాన్ ఆలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి బాలాపూర్ చౌరస్తా, శివాజీ చౌక్, పహాడిషరీఫ్, తుక్కుగూడ, మహేశ్వరం గేటు, మహేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వరకు అనుచరులు, కార్యకర్తలతో కలిసి భారీ బైక్ ర్యాలీతో వచ్చి నామినేషన్ దాఖలు చేయనున్నారు.

హ్యాట్రిక్ విజయం తథ్యం

మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: రాష్ట్రంలో కేసీఆర్, చేవెళ్లలో కాలె యాదయ్య హ్యాట్రిక్ విజయం తథ్యమని, దీనిని ఎవరూ అడ్డుకోలేరని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య నామినేషన్ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గ చరిత్రలోనే కనీవినీ ఎరుగని మెజార్టీతో కాలె యాదయ్యను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. పాలలాంటి మనస్సున్న యాదయ్య కావాలా ఆయుధాలు సరఫరా చేసే అభ్యర్థి కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని చేవెళ్ల ఎన్నికల ఇన్‌చార్జి పి. కార్తీక్‌రెడ్డి అన్నారు. రెండుసార్లు ప్రజలు అవకాశం ఇస్తే అందుబాటులో ఉండి సేవ చేశానని.. మరోసారి అవకాశం ఇస్తే మరింతగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీటీసీలు శ్రీకాంత్, జయమ్మ అవినాష్‌రెడ్డి, మాలతి, ఎంపీపీ ఎం.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన సాధారణ పరిశీలకులు



సాధారణ పరిశీలకుడికి మొక్కతో స్వాగతం పలుకుతున్న కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులను జిల్లాకు నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. గురువారం జిల్లాకు చేరుకున్న ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాలకు సంబంధించి సాధారణ పరిశీలకులు రామ్‌కుమార్‌కు కలెక్టర్ భారతి హోళికేరి అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. శాసనసభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లాలో చేపడుతున్న కార్యకలాపాల గురించి రామ్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ శేరిలింగంపల్లి అభ్యర్థిగా రవి కుమార్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి ఎంపికకు తెరదించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్ యాదవ్‌కు పిలుపు వచ్చింది. ఈ మేరకు ఆయనకు టికెట్ ఖరారు చేస్తూ అధిష్టానం ఫోన్ చేసి తెలిపింది. దీంతో మసీదుబండలోని కార్యాలయం, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, రవికుమార్‌యాదవ్ నివాసంలో కార్యకర్తలు, నాయకులతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు స్వీట్లు పంచి బాణసంచా కాల్చారు. శుక్రవారం భారీ ర్యాలీతో నామినేషన్ వేసేందుకు రవి కుమార్ యాదవ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



నామినేషన్ వేస్తున్న ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి అమరేందర్

14 మంది 18 సెట్ల నామినేషన్లు

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గానికి సబంధించి గురువారం 14 మంది అభ్యర్థులు 18 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూరజ్ కుమార్ తెలిపారు. నామినేషన్ వేసినవారిలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సబితారెడ్డి తరుపున ఆమె మద్దతుదారులు, బీజేపీ నుంచి అందెల శ్రీరాములు, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫామ్స్ పార్టీ నుంచి రాములు యాదవ్, ప్రజా ఏక్తా పార్టీ నుంచి సందీప్‌గౌడ్, జన శంఖారావం పార్టీ నుంచి కళ్లెం లక్ష్మారెడ్డి, శివసేన పార్టీ నుంచి మహేష్ కుమార్, భారత చైతన్య యువజన పార్టీ నుంచి సురేష్, దేశ్ జన్‌హిత్ పార్టీ నుంచి మహ్మద్ తేజ్, ధర్మ సమాజ్ పార్టీ నుంచి గుండ్రపల్లి అమరేందర్, ఈసరి సూర్యప్రకాష్ రెడ్డి (స్వతంత్ర అభ్యర్థి), సభావత్ సవీందర్ (స్వతంత్ర అభ్యర్థి), శివప్రసాద్ (స్వతంత్ర అభ్యర్థి), రఘురామ్ నాయక్ (స్వతంత్ర అభ్యర్థి), యాదయ్య(స్వతంత్ర అభ్యర్థి) ఉన్నారు. ఒక్కో అభ్యర్థి ఒక్కోసెట్ నామినేషన్ వేయగా స్వతంత్ర అభ్యర్థి సవీందర్ మూడు సెట్లు, బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు రెండు సెట్లు, భారత యువజన చైతన్య పార్టీ అభ్యర్థి రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు.



నామినేషన్ వేస్తున్న భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి సురేష్

చెల్లీ.. నీ ఓటు మా ఆయనకే


మహిళకు బొట్టుపెట్టి ఓటు అభ్యర్థిస్తున్న కేఎస్ రత్నం సతీమణి ప్రమీల

షాబాద్: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నంను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని ఆయన సతీమణి ప్రమీల, కూతురు డాక్టర్ ప్రణీత కోరారు. గురువారం షాబాద్ మండలం ఆస్పల్లిగూడ, చర్లగూడలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు బొట్టు పెట్టి ఓటును అభ్యర్థించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

కరవాలం చేతబూని.. అశ్వంపై బయలుదేరి..


ఎల్‌బీనగర్‌లో అశ్వంపై వచ్చి ఓ స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ వేశారు. తెలంగాణ కుమ్మరి సంఘం ఉపాధ్యక్షుడు, సామాజిక కార్యకర్త డాక్టర్ కేవీబీ వసంతరాయలు ప్రజాపతి గత ఎన్నికల్లో కూడా స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగారు. గురువారం నామినేషన్ వేసేందుకు చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై బయలుదేరిన ఆయనను దారిలో పలువురు ఆసక్తి తిలకించారు.

– చైతన్యపురి

ప్రచార కూలీలు

- జోరందుకున్న ఎన్నికల ప్రచారం
- ర్యాలీలు, సభలకు భారీగా జనసమీకరణ
- అడిగినంత ఇస్తామంటేనే ర్యాలీల్లోకి కూలీలు
- మద్యం, హోటళ్లు, పూలదండలకు భలే గిరాకీ



షాబాద్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటాపోటీగా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. అన్నివర్గాల ప్రజలను ఆకర్షించేలా భారీ ర్యాలీలు.. మైకుల మోత.. కళాకారుల కోలాట నృత్యాల నడుమ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధాన నాయకుల వెంట ఎల్లప్పుడూ పెద్ద ఎత్తున ప్రజలు ఉండేలా చూసుకుంటున్నారు. అభ్యర్థులు ఓట్ల కోసం చెమటోడుస్తుండగా మరో వైపు మద్యం, బిర్యానీ సెంటర్లు, పూలదండలు, బొకేల వ్యాపారం ఊపందుకుంది.

పూలదండలకు గిరాకీ...

కండువా మారుస్తున్నా, ప్రచారం కోసం ఊర్లోకి వచ్చే అభ్యర్థికి స్వాగతం పలకాలంటే పూలదండలు, శాలువాలు ముఖ్యం. దీంతో సాధారణ రోజుల కంటే ఎన్నికల సమయంలో దండల అమ్మకాలు పెరిగాయి. ఆయా పార్టీల అభ్యర్థులు తమ ఇంటి నుంచి ప్రచారం మొదలు చేసిన సమయం నుంచి తిరిగి వచ్చే వరకు అభిమానులు పూలదండలతో వారిని ముంచెత్తుతున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పూల దండలు తయారు చేసే వ్యాపారులకు చేతినిండా పని దొరికినట్లయ్యింది.

బీరు..బిర్యానీ

పార్టీల కోసం ప్రచారం చేసే నాయకులంతా పొద్దంతా కష్టపడి సాయంత్రం బీరు, బిర్యానీతో చిల్ అవుతున్నారు. ఎన్నికల ర్యాలీల పుణ్యమా అని జిల్లాలో మద్యం అమ్మకాలు అమాంతంగా పెరిగిపోయాయి. శ్రేణులు చేజారిపోకుండా ముందు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు అభ్యర్థులు. దీంతో వంటలు, కేటరింగ్ చేసేవారికి ఫుల్‌గా పని దొరుకుతుండగా.. బిర్యానీ సెంటర్లకు గిరాకీ పెరిగింది.

కళాకారుల ఆటాపాట..

ఎన్నికల ప్రచారంలో ప్రజలను ఉత్తేజ పర్చాలంటే కళాకారుల ఆటాపాట ఉండాల్సిందే. ప్రచార జోరులో కళాకారులు హోరెత్తిస్తున్నారు. కళాకారుల పాడే పాటలతో ప్రచారానికి ఊపొస్తుంది. కళాకారులతో పాటు కోలాటం, బతుకమ్మ ఆడే మహిళలకు ఉపాధి బాగా దొరుకుంతోంది.

సామాజిక మధ్యమాల ద్వారా..

ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రచారంలో కీలక భూమిక పోషిస్తున్న సామాజిక మాధ్యమాలను పూర్తిగా వినియోగించుకుంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌తో పాటు ఎస్ఎంఎస్‌లు, వాయిస్ కాల్స్‌తో నిత్యం ఓటర్లకు చేరువవుతున్నారు. దీంతో డిజిటల్ మార్కెటింగ్ చేసే చాలామందికి చేతినిండా పని లభిస్తోంది.


వాహనాలకు డిమాండ్..

ప్రచారం ఊపందుకోవడం, పార్టీల ముఖ్య నేతల ప్రచార సభల నేపథ్యంలో ట్యాక్సీలు, ట్రావెల్స్‌కు డిమాండ్ ఉంది. ప్రచారానికి నియోజకవర్గ స్థాయిలో తిరుగుతున్న సమయాల్లో పార్టీల అనుచరగణాన్ని తరలించేందుకు ప్రైవేటు వాహనాలను మాట్లాడుకుంటున్నారు. అలాగే నియోజకవర్గం, జిల్లా పరిధిలో నిర్వహించే సభలకు వందల సంఖ్యలో వాహనాలు అవసరమవుతున్నాయి.

బిజీగా కూలీలు...

ఎన్నికల పండగ రావడంతో రోజువారీ కూలీలకు డిమాండ్ బాగా పెరిగింది. కూలిపని చేసి రోజంతా కష్టపడి పనిచేస్తే వచ్చే కూలీకంటే ప్రచారంలో పాల్గొంటే వచ్చే డబ్బులు ఎక్కువగా ఉండటంతో వారు ర్యాలీల్లో పాల్గొంటున్నారు. అభ్యర్థి ప్రచారానికి వెళ్లే సమయంలో తమ వెంట జనం కనిపించేలా ముందుగానే కూలీలను బుక్ చేసుకుంటున్నారు.

హ్యాట్రిక్ ఎమ్మెల్యే ఇంద్రారెడ్డి


మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గం నుంచి మూడు సార్లు(హ్యాట్రిక్) ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఏకైక వ్యక్తి దివంగత ఇంద్రారెడ్డి మాత్రమే. వరుసగా మూడుసార్లు టీడీపీ నుంచి గెలుపొందిన ఇంద్రారెడ్డి నాలుగోసారి కాంగ్రెస్ నుంచి పోటీచేసి విజయం సాధించారు. మొదటిసారి 1985లో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత 1989, 1994లోనూ టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు. 1999లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి నాలుగోసారి గెలుపొందారు. అయితే 2000 సంవత్సరంలో ఇంద్రారెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన తర్వాత ప్రస్తుతం ఎమ్మెల్యే కాలె యాదయ్యకు చేవెళ్ల నుంచి హ్యాట్రిక్ విజయం సాధించే అవకాశం వచ్చింది. ఇప్పటికే ఆయన రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2018లో బీఆర్ఎస్ నుంచి పోటీచేసి గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఈసారి విజయం సాధిస్తే చేవెళ్ల నుంచి యాదయ్యకు సైతం హ్యాట్రిక్ విజయం అందుతుంది.

గజ్వేల్‌లో శంకర్ హిల్స్ బాధితుల నామినేషన్లు

- గురువారం 45మంది దాఖలు
- మరో 50మంది వేసే అవకాశం


గజ్వేల్‌లో నామినేషన్లు వేసిన శంకర్‌హిల్స్ బాధితులు

గజ్వేల్: తమ సమస్య పరిష్కారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని శంకర్ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధితులు గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ స్థానంలో నామినేషన్లు వేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్నందు వల్ల ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్ళడానికే నామినేషన్లు వేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 45మంది నామినేషన్లు వేశారు.అనంతరం విలేకరులతో మాట్లాడారు. వట్టి నాగులపల్లిలో 1983లో తాము 400 ఎకరాల భూమిని రైతుల వద్ద కొనుగోలు చేసి 3,300 ప్లాట్లుగా అభివృద్ధి చేసుకున్నామని, వీటికి సంబంధించి రిజిస్ట్రేషన్లు సైతం పక్కాగా ఉన్నాయని వారు తెలిపారు. 111 జీవో వల్ల ఆ ప్లాట్లలో నిర్మాణాలు చేపట్టలేక పొజిషన్‌లో ఉన్నామని పేర్కొన్నారు. ధరణి వచ్చిన తర్వాత ఆ ప్లాట్లను వ్యవసాయ భూమిగా రికార్డుల్లో మార్చి బడాబాబులు కాజేయాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని, విసిగిపోయి గజ్వేల్‌లో నామినేషన్లు వేయడం ద్వారా తమ నిరసనను తెలియజేయడానికి నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నవాబుపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి డీబీ శీతల్ సూచించారు. నవాబుపేట ఆదర్శ పాఠశాలలోని బాలికల హాస్టల్లో వంట మనుషులు లేని విషయాన్ని విద్యార్థినులు సోషల్ మీడియాలో పెట్టడంతో వారు స్పందించారు. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ సుదర్శన్ ఆదేశాల మేరకు అధికారులను పిలిపించి మాట్లాడారు. మరో సారి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. వెంటనే వంట వారిని నియమించాలన్నారు.

ఓటుతోనే బంగారు భవిష్యత్


సెలబ్రిటీ కామెంట్

హైదరాబాద్ నగరం ప్రస్తుతం ఎంతో బాగుంది. అభివృద్ధి చెందుతోంది. మౌలిక సదుపాయాలు పెరుగుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే విశ్వనగరంగా మారుతోంది. ఈ క్రమంలో ఓటును సద్వినియోగం చేసుకోవాలి. మన బంగారు భవిష్యత్ తరాల కోసం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుని జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలి.

– రక్షిత్ అట్లూరి, 'పలాస 1978', 'నరకాసుర' చిత్రాల ఫేం

కాషాయ జెండా ఎగురవేస్తాం

- సబితారెడ్డి, కేఎల్ఆర్‌ను చిత్తుగా ఓడించండి
- అందెల నామినేషన్ ర్యాలీలో బండి సంజయ్


అభివాదంచేస్తున్న బండి సంజయ్, అందెల

మహేశ్వరం: మహేశ్వరం గడ్డపై కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. గురువారం ఆ పార్టీ మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న బండి మాట్లాడుతూ.. సబితారెడ్డి, కేఎల్ఆర్‌ను చిత్తుగా ఓడించి ఇంటికి పంపాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికులకు కాకుండా పాతబస్తీకి చెందిన ఎంఐఎం కార్యకర్తలకు ఇచ్చారని ఆరోపించారు. అందెల శ్రీరాములు మాట్లాడుతూ.. మహేశ్వరంలో స్థానికేతరులకు ఓటుతోనే తగిన బుద్ధి చెప్పాలని కోరారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు ప్రవీణ్, పాపయ్య గౌడ్, సుదర్శన్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, జంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వయసు సరిపోలే!

ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఆ యువకుడు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. నామినేషన్ పత్రాలను పూర్తి చేసి ఒక సెట్‌ను వేసేందుకు కేంద్రానికి వచ్చారాయన. వయసు 25 ఏళ్లు లేకపోవడంతో అధికారులు ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రాంతానికి చెందిన గౌతమ్ (24)కు జనతా కాంగ్రెస్ పార్టీ నాలుగు రోజుల క్రితం బీ–ఫాం అందజేసింది. గురువారం ఒక సెట్ నామినేషన్ వేసి 10వ తేదీన తన ర్యాలీగా మరో నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. నామినేషన్ పత్రాలను పరిశీలించిన అధికారులు పోటీ చేసేందుకు వయసు సరిపోదు అనడంతో గౌతమ్ నిరాశతో వెనుదిరిగారు.

– రాజేంద్రనగర్

ఓటు @ ఐదు రకాలు

వివిధ హోదాల్లో వినియోగం

షాద్‌నగర్: ఎన్నికలు అంటేనే అందరికి గుర్తుకు వచ్చేది ఓట్లు. ఐదేళ్లు పాలించే నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటుహక్కు తప్పనిసరిగా ఉండాలి. ఎన్నికలు వచ్చాయంటే చాలు ఓటర్ల జాబితాలో తమపేరు ఉందో లేదో అని అందరూ ఓసారి సరి చూసుకుంటారు. అయితే ఓటుహక్కు కలిగి ఉండి పోలింగ్ బూత్ నుంచి తిరిగి బయటికి వేలికి సిరా వేసుకుని వచ్చేటప్పుడు ఓటరు మోహంలో ఎనలేని ఆనందం కనిపిస్తుంది. అదే కొత్త ఓటరు అయితే ఆ ఆనందం రెట్టింపు అవుతుంది. అయితే ఓట్లలో పలు రకాలు ఉంటాయని చాలామందికి తెలియదు. ఓట్లలో మొత్తం 5 రకాలు ఉంటాయి. వివిధ హోదాల్లో వీటిని వినియోగించుకోవచ్చు. ఒకసారి వాటిని పరిశీలిస్తే..

1. సాధారణ ఓటు

భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించింది. ఇలా ఓటు హక్కును పొందినవారు తమకు నచ్చిన నేతకు ఓటు వేసుకునే అవకాశం ఉంది. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి మామూలుగా ఓటువేస్తే దాన్ని సాధారణ ఓటు అంటారు.

2. పోస్టల్ బ్యాలెట్

ఎన్నికలు సజావుగా కొనసాగాలంటే చాలా మంది ఇందుకు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అధికారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు ఓటు వేసేందుకు గ్రామాలకు పట్టణాలకు వెళ్లి ఓటుహక్కును వినియోగించుకోలేరు. ఇందుకు గాను ఎన్నికల సంఘం ఉద్యోగులు, అధికారుల కోసం పోస్టల్ బ్యాలెట్‌ను ప్రవేశపెట్టింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారికి నచ్చిన వారికి ఓటు వేసి ఎన్నికల అధికారులకు ముందుగానే పంపించవచ్చు.

3.సర్వీస్ ఓటు

దేశ రక్షణలో భాగంగా చాలామంది సైనికులు, పారామిలటరీ ఉద్యోగులు స్వరాష్ట్రానికి వెళ్లి ఓటుహక్కును వినియోగించుకోలేరు. తమకు నచ్చిన నాయకుడికి ఓటు వేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం వీరికి వెసులుబాటు కల్పించింది. వీరిని సర్వీసు ఓటర్లుగా గుర్తించి.. వారి కోసం ప్రత్యేకంగా సర్వీసు ఓటును కలిప్పించింది. వీరు సర్వీస్‌లో ఉన్న ప్రాంతం నుంచే ఓటు వేయవచ్చు.

4.టెండర్ ఓటు

ఓటరు జాబితాలో పేరు ఉండి పోలింగ్ బూత్‌లోకి వెళ్లిన తర్వాత తమ ఓటును వేరొకరు వేశారని తెలిస్తే ఎంతో కోపం వస్తుంది. తాము ఎన్నికల్లో ఓటు వేయలేదని.. తమ ఓటును ఎవరో వేశారని ఎన్నికల అధికారులకు సంతృప్తి పరిచే విధంగా చెప్పగలగాలి. నిజంగా ఓటును ఇతరులు వేశారని తెలుసుకొని అధికారులు సంతృప్తి చెందితే అప్పుడు వారికి ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తారు. దీన్నే టెండర్ ఓటు అంటారు.

5.ప్రాక్సీ ఓటు

కేంద్ర నిఘా సంస్థలు, గూఢాచారి సంస్థల సిబ్బంది తమ ఉనికిని మరెవరికి తెలియనీయకుండా గోప్యంగా ఉంటారు. వారు తన ప్రతినిధిగా మరెవరినైనా పంపించి ఓటు వేయవచ్చు. ఈ విధమైన ఓటు హక్కునే ప్రాక్సీ ఓటు హక్కు అంటారు.

జంపింగ్.. జపాంగ్


ఉదయం మంత్రి సబితారెడ్డి వెంట ప్రచారంలో బాలప్ప


మధ్యాహ్నం కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బాలప్ప

మీర్‌పేట: ఉదయం బీఆర్ఎస్ ప్రచారంలో.. మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ కండువాతో దర్శనం.. వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడకు చెందిన మాజీ ఉపసర్పంచ్, ఎంపీటీసీ, బీఆర్ఎస్ నేత సిద్దాల బాలప్ప గురువారం ఉదయం మంత్రి సబితారెడ్డితో కలిసి జిల్లెలగూడలో ఎన్నికల(బీఆర్ఎస్) ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం గంటల వ్యవధిలోనే కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చనగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే బాలప్పతో పాటు మరికొందరు బీఆర్ఎస్ నాయకులు కూడా కేఎల్ఆర్ సమక్షంలో హస్తం గూటికి చేరారు.

కండువా మార్చేశాడు..

మొయినాబాద్: మొయినాబాద్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌గౌడ్ ఐదు రోజుల్లో రెండు పార్టీలు మారారు. గత ఆదివారం చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ స్థానికంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సందర్భంగా మోహన్‌గౌడ్‌ను కలిశారు. అప్పుడు భీంభరత్ చేతుల మీదుగా ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గురువారం మొయినాబాద్‌లో బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం నివాసంలో మోహన్‌గౌడ్ బీజేపీలో చేరారు.


భీంభరత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మోహన్‌గౌడ్


వారం వ్యవధిలో రత్నం సమక్షంలో బీజేపీలో చేరిన మోహన్‌గౌడ్